అభివృద్ధి మరిచిన వారికి గుణపాఠం చెప్పాలి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు
- రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే రాజేందర్‌రావును గెలిపించండి
- మంత్రి పొన్నం ప్రభాకర్



కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 26: అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని పట్టించుకోని నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలో శుక్రవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీలుగా పనిచేసిన వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్ ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. దేవుడి పేరుతో ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కనీస పరిజ్ఞానం లేని సంజయ్‌కుమార్ నోటికి వచ్చినట్లు మాట్లా డడం మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిరంకుశంగా పాలన కొనసాగించారన్నారు. అభివృద్దే ధ్యేయంగా పనిచేయడానికి వస్తున్న తనను ఆదిరించాలని కోరారు. రైతుల రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉన్నదని, కొంతమంది నాయకులు చేసే ప్రకటనలు నమ్మవద్దన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేస్తు సంతోషంగా ఉన్నారన్నారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే తప్పుడు ప్రచారానికి పాల్పడుతుందన్నారు.ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, పీసీసీ కోఆర్డీనేటర్ పాశం రాజేందర్ రెడ్డి, అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, బాలపోచయ్య, మహేందర్‌రెడ్డి, రజనీకాంత్, రమేష్, అమర్, మల్లేశం, దయాసాగర్ పాల్గొన్నారు.

● రాష్ట్రానికి చేసిందేమీ లేదు: మంత్రి పొన్నం

సైదాపూర్: గడిచిన పది సంవత్సరాల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండి తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమి లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో సైదాపూర్ మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్కేపల్లి గాంధీ విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యానని, ఈ ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేసి రాజేందర్‌రావును అధిక మెజారిటీతో గెలింపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమిని తట్టుకోలేక పిల్లి శాపనార్థాలు పెడుతున్నదన్నారు. ఆగస్టు 15 లోపు రైతులకు రుణమాఫీ చేస్తామని, హరీష్‌రావు రాజీనామాతో సిద్దంగా ఉండాలని, అగ్గిపెట్టె రాజకీయం చేయొద్దన్నారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటాం..

చిగురుమామిడి: రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంతో కొట్లాడి మనకు రావాల్సిన నిదులు తీసుకు వచ్చే వ్యక్తి రాజేందర్‌రావు అన్నారు. ఆయనను ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంటు నియెకవర్గ ఇన్‌చార్జి బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మహిళ అధ్యక్షురాలు పోలు స్వప్న, జడ్పీటీసీ గీకురు రవీందర్ పాల్గొన్నారు.



చిగురుమామిడిలో కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



సైదాపూర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బండి సంజయ్ చేసిందేమీ లేదు

- మోదీ రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ ఏది?
- ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో గళమెత్తుతా
- బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



గన్నేరువరం రోడ్ షోలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌కు గానీ, పార్లమెంట్ నియోజక వర్గానికి, ప్రజలకు చేసిందేమి లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక అంబేద్కర్ స్టేడియంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ వాకర్స్‌ను కలిసి ఎంపీగా తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏడాదికి రెండు లక్షల చొప్పున రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎంపీగా ఏమి చేశావో చెప్పమని బండి సంజయ్‌ని అడిగితే కేంద్ర పథకాల నుంచి నిధులు తెచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు తోట రాములు, అయిలేందర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్, బీజేపీకి ఓటేసే పరిస్థితి లేదు

కాంగ్రెస్, బీజేపీలకు రైతులు వ్యతిరేకంగా మారడంతో ఆ రెండు పార్టీ అభ్యర్థులకు ఓటు వేసే పరిస్థితి లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక ఉండాలని, వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నా రు. ఎమ్మెల్యే, ఎంపీ ఒకే పార్టీ వారైతే అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలతమహేశ్, తోట తిరుపతి, కరీంనగర్, కొత్తపల్లి మండలాల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కాసారపు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎఎంసీ ఛైర్మన్ రెడ్డివేణి మధు, కో ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, వైస్‌ఎంపీపీ తిరుపతి నాయక్, సుంకిశాల సంపత్‌రావు పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌కు ఓటేసి కయ్యలో పడొద్దు...

కరీంనగర్ టౌన్/గన్నేరువరం: కాంగ్రెస్‌కు ఓటేసి కయ్యలో పడొద్దని, బీజేపీకి ఓటు వేసి మోసపోవద్దని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం గన్నేరువరం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి వినోద్‌కుమార్ ప్రసంగించారు. బండి సంజయ్‌కి అభివృద్ధి చేయడం చేతగాక పూటకో మాట, రోజుకో వేషం వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ అసమర్ధత కారణంగానే కరీంనగర్‌కు వచ్చిన ట్రిపుల్ ఐటీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలించిందని విమర్శించారు. ఐదేళ్లలో సంజయ్ జడ్పీ మీటింగ్‌కు కూడా హాజరుకాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగి పంటకు క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తామని, ఇప్పుడు ఇవ్వకుండా దాటవేసే ధోరణితో రైతులను మోసం చేసిందని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నపుడు గన్నేరువరం మండల కేంద్రాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేశానని, గన్నేరువరం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశానని గుర్తుచేశారు. కార్యక్రమంలో టెస్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, వైస్ ఎంపీపీ స్వప్న సుధాకర్, రెడ్డవేని తిరుపతి, గడ్డం నాగరాజు, మాజీ సర్పంచు లక్ష్మి లక్ష్మణ్ పాల్గొన్నారు.



కరీంనగర్ సమావేశంలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



వాకర్స్‌కు కరపత్రాన్ని అందిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్న వినోద్‌కుమార్

వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు

సిరిసిల్ల క్రైం/వేములవాడ, ఏప్రిల్ 26: వేసవిలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు పోలీసుశాఖ ఏర్పాట్లు చేస్తోంది. మే 1నుంచి 31వరకు సాగే ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. 14 ఏళ్ల పైబడిన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని సిరిసిల్లటౌన్, ఎల్లారెడ్డిపేట, వేములవాడ టౌన్, కోనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, పేయింటింగ్, అబకాస్, కరాటే, యోగా, ఆర్చరీ, డ్యాన్స్, అథ్లెటిక్స్, మార్షల్ ఆర్ట్స్, కుండల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు.

రుణమాఫీ కాకూడదనేది బీఆర్ఎస్ ఆంతర్యం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: రైతులకు రుణమాఫీ కాకూడదనేదే బీఆర్ఎస్ ఆంతర్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని చీర్లవంచలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీలోగా రైతులకు రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, దీనిపై ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ రుణమాఫీ సాధ్యం కాదనడం, చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనమా చేస్తాననడం హాస్యాస్పదమని అన్నారు. హరీష్‌రావు రాజీనామా పత్రాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. దేవుడి పేరిట బీజేపీ రాజకీయాలు చేస్తోందని, జన్‌దన్ ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తామని బీజేపీ ప్రజలను మోసం చేసిందని అన్నారు. జీఎస్టీ పేరిట బీజేపీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందన్నారు. గడిచిన 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేలా ప్రతీ కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కత్తి కనుకయ్య, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెర్ల మల్లేశం, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఇటిక్యాల లింగయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బోనాల రమేష్, గ్రామ అధ్యక్షుడు ఈర్నాల గణేష్, వైస్ ఎంపీపీ వనపర్తి దేవరాజు, ఎంపీటీసీలు బాస రాజశేఖర్, గాలిపెల్లి సువర్ణ స్వామి, వనపట్ల ప్రభాకర్, ఎర్రం సత్తయ్య, ఎర్రం ఆగయ్య, కుర్మ రవి, మారం రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ప్రజలను చైతన్యం చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విని యోగించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల సమైక్య భవనంలో 'ఓటు హక్కు నా బాధ్య త'పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు విని యోగించుకునేలా చూడా లన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమన్నారు. ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ కోరారు. మండల సమైక్య ప్రతినిధులు పాల్గొన్నారు.

భారతీయుల ఆత్మ.. బీజేపీ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ అంబేద్కర్‌ను అవమానించాయి
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

మానకొండూర్, ఏప్రిల్ 26: బీజేపీ అంటే భారతీయుల ఆత్మ అని ఎంపీ, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో దళిత సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నదన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవమానించాయని, అలాంటి పార్టీలకు దళితులు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ పేరులోనే భారతీయత ఉందని, ఈ పార్టీని ఈ దేశ ముద్దు బిడ్డలయిన అటల్ బిహరీ వాజ్‌పేయ్, ఎల్కే అద్వాని స్థాపించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో భారతీయత ఎక్కడుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పొరపాటున అధికారంలోకి వస్తే పేదలు సహా ఎవ్వరు చనిపోయినా వారి ఆస్తిలో 55 శాతం గుంజుకుంటుందని హెచ్చరించారు. ఇదే విషయాన్నికాంగ్రెస్ పార్టీ విదేశాంగ విభాగం ఇన్‌చార్జి శ్యాంపిట్రోడా స్పష్టం చేశారని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వారిని నడి రోడ్డున పడేసిందని విమర్శించారు. పరాయోడు మోసం చేస్తే పొలిమేర దాకా తరిమికొట్టమని, సొంతోడు మోసం చేస్తే పాతపెట్టమని ప్రజాకవి కాళోజీ అన్నారని, తెలంగాణను దోచుకున్న ఆంధ్రా పాలకులను తరిమి కొట్టి పొలిమేర దాటించినమని, ఇగ బీఆర్ఎస్‌ను పాతరేసే టైమొచ్చిందన్నారు. జూన్ 4న ఆ పార్టీని గొయ్యి తీసి వెయ్యి అడుగుల లోతున పాతరేసేందుకు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు సిద్ధమయ్యారన్నారు. కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నడైనా మీ వద్దకు వచ్చారా? మీ కోసం ఎన్నడైనా పోరాడారా అని ప్రశ్నించారు. తాను ప్రజల కోసం చేసిన పోరాటాలేమిటో... వాళ్లు చేసిన పోరాటాలేమిటో బేరీజు వేసుకుని ఓటేయండని కోరారు. తనను ఓడించేందుకు ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయని, కేసీఆర్ కూడా ఐదు రోజులు కరీంనగర్‌కు వచ్చి తనను ఓడగొట్టడానికి కుట్ర చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎస్ కుమార్, మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కుమ్మరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రంగు బాస్కరాచారి, మండల అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

● బీజేపీలో భారీగా చేరికలు

భగత్‌నగర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఆ పార్టీల కార్యకర్తలే ఓటు వేసే పరిస్థితి లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో మానకొండూర్, చొప్పదండి నియోజక వర్గాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో తెలియదన్నారు. అటువంటి వ్యక్తికి ఎలా ఓటేస్తారని ప్రశ్నించారు.

● కమలాపూర్ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్న బండి సంజయ్

కమలాపూర్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం రాత్రి హుజూరాబాద్ నియోజక వర్గంలోని కమలాపూర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు. రథాన్ని స్వయంగా లాగుతూ భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు.



కరీంనగర్‌లో కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్



కమలాపూర్ శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకుంటున్న బండి సంజయ్‌కుమార్

వేములవాడ పట్టణ సీఐగా వీరప్రసాద్

వేములవాడ, ఏప్రిల్ 26: వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బి.వీరప్రసాద్ నియామకమయ్యారు. ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన పి కరుణాకర్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో గత నెలలో మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అప్పటి నుంచి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వేములవాడ పట్టణ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వోగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ కమిషనరేట్‌లో సీసీఎస్ విభాగం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బి.వీరప్రసాద్‌ను వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ మల్టీజోన్- 1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విధుల్లో చేరారు.





భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను తాగుడుకు బానిసై ఆమెను రోకలిబండతో కొట్టి హత్య చేసిన నేరంలో నిందితుడు భర్తకు జీవిత ఖైదుతోపాటు 2000 రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి బి ప్రతిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీముని మండలం వాడ్ల గ్రామానికి చెందిన డోకా బక్కయ్య కూతురు వసంతను మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. ఏడాదిన్నర తర్వాత బక్కయ్య ఇంటిముందు గల మహ్మద్ సాబీర్ (30) వసంతతో ఉన్న పరిచయంతో ఆమెకు మాయమాటలు చెప్పి తీసుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ సంఘటన తర్వాత బక్కయ్య తన కుటుంబంతో సహా బతుకుదెరువు కోసం చొప్పదండి మండలం మంగళ్ళపల్లికి వచ్చి జీవిస్తున్నాడు. వసంతకు కూడా ఆర్థిక ఇబ్బందులు రావడంతో కుటుంబంతో సహా తండ్రి వద్దకు వచ్చి వారితో కలిసి జీవిస్తున్నది. వసంత భర్త సాబీర్ తాగుడుకు బానిసై 2017 అక్టోబర్ 13న రాత్రి తాగివచ్చి భార్యతో గొడవపడి ఆమెను రోకలిబండతో తీవ్రంగా గాయపరచడంతో ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ సంఘటనపై బక్కయ్య చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాబీర్‌పై హత్యానేరం కేసు నమోదు చేయగా అప్పటి సీఐ లక్ష్మీబాబు కేసు దర్యాప్తు జరిపి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడు సాబీర్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 26: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మోతె మల్లమ్మ(75) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మల్లమ్మ(75)గురువారం ఉదయం ఇంటి ముందు శుభ్రం చేస్తున్న క్రమంలో ఆమె కుడిచేయిపై గుర్తు తెలియన విష పురుగు కుట్టింది. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మల్లమ్మ మరణించింది. మల్లమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భూమి ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్టు

వీణవంక, ఏప్రిల్ 26: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో 2.26 ఎకరాల వ్యవసాయ భూమిని ఫోర్జరీ చేసి ఇతరులకు విక్రయించిన కేసులో శుక్రవారం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన దూలం రాజయ్య తన 2.26 ఎకరాల వ్యవసాయ భూమిని అవసరం నిమిత్తం గ్రామానికి చెందిన మేకల మోహన్‌రెడ్డికి 1.13, కొలిపాక రామస్వామికి 1.13 ఎకరాలు విక్రయించారు. ఈ భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. భూమి విక్రయం రాజయ్య మేనల్లుడు బొంగోని స్వామికి ఇష్టం లేక పోవడంతో అతడు రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో ఒప్పందం చేసుకుని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనికి గతంలో పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ధరణి ఆపరేటర్ అరుణ్ చౌదరి సహకరించారు. ఈ మేరకు వారికి స్వామి రెండు లక్షల రూపాయలు ముట్టజెప్పేందుకు ఒప్పందం చేసుకు న్నాడు. పథకం ప్రకారం మోహన్‌రెడ్డి, కొలిపాక రామస్వామికి రిజిస్టేషన్ ఒరిజనల్ పత్రాలు సిబ్బంది ఇవ్వలేదు. భూమి హక్కు పత్రాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వారిని వేలి ముద్రలు వేస్తేనే ఒరిజనల్ పత్రాలు వస్తాయని ధరణి ఆపరేటర్ నమ్మించాడు. వారి అతడి మాటను విశ్వసించి వేలిముద్రలు వేశారు. దీంతో వారి పేరు మీద ఉన్న భూమి బొంగోని స్వామికి విక్రయించినట్లు పత్రాలు తయారు చేసి అందజేశారు. కబ్జాల్లో మోహన్‌రెడ్డి, రామస్వామి ఉన్నప్పటికీ హక్కు పత్రాలు స్వామి పేరిట ఉన్న విషయం తెలియడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరు నిందితులు స్వామితో పాటు అరుణ్ చౌదరిని అరెస్టు చేశామని, ఈ కేసుతో సంబంధం ఉన్న మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని ఎస్సై తిరుపతి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.













డిప్లొమా కోర్సులో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: కేంద్ర జౌళి మంత్రిత్వశాఖకు సంబంధించిన ఒరిస్సా రాష్ట్రంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, బార్గా కళాశాలలో మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్లూం, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్లు చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎస్ చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై జూలై 16, 2024 నాటికి జనరల్ కేటగిరిలో 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలలో 15 నుంచి 25 సంవత్సరాలు నిండిన వారు అర్హులని, ఈ కళాశాలలో తెలంగాణ రాష్ట్రానికి తొమ్మిది సీట్లు కేటాయించారని తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు జూన్ 10, 2024లోగా వారి దరఖాస్తులను నిర్ణీత ప్రొఫార్మాలో నెల్లూరు జిల్లాలోని ప్రిన్సిపాల్, ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి చిరునామాకుగానీ, కరీంనగర్ మంకమ్మతోటలోని సహాయ సంచాలకుడు చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

తిమ్మాపూర్, ఏప్రిల్ 26: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో గల 8వ డివిజన్ అలుగు నూర్‌లో అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది శుక్రవారం ఓ వ్యవసాయ భావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన పున్నం సత్తమ్మ(51) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స కోసం ఆస్పత్రులకు వెళితే డబ్బులు ఖర్చు అవుతున్నా నయం కావడం లేదని మనస్తాపం చెందింది. శుక్రవారం తెల్లవారు జామున 5గంటలకు సత్తమ్మ వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సత్తమ్మ భర్త శ్రీనివాస్, కుమారుడు హరీష్ ఆమె కోసం గాలి స్తుండగా కొద్ది దూరంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద సత్తమ్మ చెప్పులు గమనించారు. బావిలోకి చూడగా సత్తమ్మ మృతదేహం కనిపించింది. సత్తమ్మ అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 26: మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రిలోని అటెండర్ ముద్దం గంగాధర్(42) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మదం గంగాధర్ పనుల నిమిత్తం మెట్‌పల్లి పట్టణానికి వెళ్తున్న క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని వీఆర్‌ఎమ్ గార్డెన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఏప్రిల్ 26: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తది తర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొ క్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధా లయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. వందలాది మంది భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

శ్రీలంక అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి

- ఎల్లలు దాటిన ప్రేమ.. పెళ్లితో ఒక్కటయ్యారు..

రాయికల్/మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 26: జగిత్యాల జిల్లా రాయికల్ మండంలోని భూపతిపూర్‌లో శ్రీలంక అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి శుక్రవారం ప్రేమ పెళ్లి చేసుకుని ఒక్కటయ్యారు. శ్రీలంక దేశానికి చెందిన మరియక్రిష్టియన్ జోర్డాన్ దేశంలో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని మెట్‌పల్లి మండలం మూడు బొమ్మల మేడిపల్లికి చెందిన జోగిడె అశోక్ ఇదే కంపెనీలో పని చేస్తున్నాడు. మూడేళ్ల పాటు ఒకే కంపెనీలో పని చేయడంతో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఇరువైపు లా కుటుంబసభ్యులకు తమ ప్రేమ విషయం చెప్పారు. కుటుంబసభ్యుల అంగీకారంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల అశోక్ తన ప్రేమికురాలు మరియతో స్వగ్రామానికి చేరుకున్నారు. అశోక్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన తన సోదరి ఇంటికి వచ్చి శుక్రవారం పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. రామోజీపేట మండలంలోని భూపతిపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో కుటుంబసభ్యులు, బంధువుల మధ్య హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు.



పెళ్లి చేసుకుంటున్న శ్రీలంక అమ్మాయి-తెలంగాణ అబ్బాయి

రోడ్డు ప్రమాదంలో రిటైర్డు ఉద్యోగి మృతి

ముస్తాబాద్, ఏప్రిల్ 26 : ముస్తాబాద్ మండలం సిద్దిపేట దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి చెందారు. ముస్తాబాద్ పట్టణానికి చెందిన అబ్రమేని సాయిలు ముస్తాబాద్ వైపు నుంచి సిద్దిపేట ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. సిద్దిపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ద్విచక్రవాహనంతో పాటు సాయిలును రోడ్డు మీద నుంచి పక్కన ఉన్న గుంతవైపు కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ద్విచక్ర వాహనం, కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యాయి. సా యిలుకు తీవ్రమైన గాయాలు కావడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమం కావడంతో మరణించినట్లు వైద్యులు తెలిపారు. సాయిలుకు భార్య పరమేశ్వరి, కూతుళ్లు వెన్నెల, అర్చన ఉన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సంఘం అధ్యక్షుడు పుల్లూరి రవి, మాజీ ఎంపీటీసీ గజ్జెల రాజు, పిట్ల విఠల్, రంజాని రాజలింగం సామాజిక వర్గ సభ్యులు డిమాండ్ చేశారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.



సాయిలు(ఫైల్)

కొడుకును రోకలిబండతో బాది హత్య చేసిన తండ్రి

- రాణాలో లొంగిపోయిన నిందితుడు శ్రీనివాస్ - ఆన్‌లైన్ గేమ్స్, అప్పులే హత్యకు కారణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: ఆన్‌లైన్ గేమ్స్‌తో డబ్బులు పోగొట్టుకుని లక్షల రూపాయలు అప్పుచేస్తున్న కొడుకును తండ్రి వారించాడు. అయినా వినకుండా హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నానని చెబుతూ స్నేహితులతో జల్సాలు చేస్తూ, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ స్థాయికి మించి 15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు వారికి ఉన్న మూడు గుంటల భూమిని విక్రయించాలని కొడుకు తన తండ్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు. ఒక దశలో భూమిని అమ్మకుంటే చంపుతానని తండ్రిని బెదిరించాడు. దీంతో కొడుకు తనను ఎలాగైనా హత్య చేస్తాడని భయంతో కొడుకు ఇంటిలో ఉన్నప్పుడు ఇంటికి రాకుండా బయటనే గడిపాడు. తనను చంపక ముందే తనే కొడుకును చంపాలని నిర్ణయించుకుని అమలు చేశాడు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్, మృతుడి బంధువుల వివరాల ప్రకారం.... కొత్తపల్లి మండలం చింతకుంటగ్రామానికి చెందిన పెరుమాండ్ల శివసాయి(21) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నానని చెబుతూ ఎలాంటి పనిచేయకుండా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ స్నేహితులతో జల్సాగా తిరుగుతూ 15 లక్షల వరకు అప్పుచేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు ఉన్న మూడు గుంటల భూమిని విక్రయించాలని ఆరు నెలలుగా తండ్రి శ్రీనివాస్‌పై తీవ్రఒత్తిడి తీసుకువస్తున్నాడు. జల్సాలకు అలవాటైన కొడుకు పద్దతి మార్చుకోవాలని ఎంత నచ్చజెప్పినా వినలేదు. భూమి విక్రయించకుంటే చంపుతానని శివసాయి తన తండ్రిని బెదిరిస్తున్నాడు. ఈక్రమంలో తనను కొడుకు చంపుతాడని అనుమానించిన శ్రీనివాస్... కొడుకు ఇంటికి వచ్చిన సమయంలో భయంతో బయటకు వెళుతున్నాడు. ఎలాగైనా కొడుకును చంపాలని నిర్ణయించుకున్న తండ్రి శ్రీనివాస్ ఐదు నెలలుగా సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. శుక్రవారం ఉదయం 10గంటలకు ఇంట్లో ఎవరూలేని సమయంలో మంచంపై నిద్రిస్తున్న కొడుకు పెరుమాండ్ల శివసాయి తల, ముఖంపై రోకలిబండతో కొట్టాడు. తప్పించుకునే ప్రయత్నం చేయటంతో అప్పటికే సిద్ధం చేసుకున్న కారంపొడిని కళ్లల్లో చల్లాడు. ఆ వెంటనే రోకలిబండతో మరో నాలుగుసార్లు తలపై కొట్టగా తల పగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకును చంపిన తరువాత నిందితుడు శ్రీనివాస్ డయల్ 100 కాల్ చేసి కొత్తపల్లి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మృతుడి తండ్రి శ్రీనివాస్ మున్సిపాలిటీలో కాంటాక్టు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంఘటనా స్థలాన్ని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ పరిశీలించి, విచారణ జరిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



శివసాయి(ఫైల్)

తనిఖీల్లో నగదు పట్టివేత

చందుర్తి, ఏప్రిల్ 26: ఎన్నికల నేపథ్యంలో తనిఖీల్లో భాగంగా ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.53,000 నగదును చందుర్తి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టగా చందుర్తికి చెందిన సాయి వంశీని తనిఖీ చేశారు. ఈ మేరకు నగదు బయటపడినట్లు తెలిపారు. రూ. 50 వేలకు పైగానగదు తీసుకెళ్లేటప్పుడు దానికి సంబంధించిన పూర్తి ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని లేనట్లయితే స్వాధీనం చేసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

భూ ఆక్రమణ కేసులో పోలీసు కస్టడీకి నిందితులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకు అరెస్టు అయి జైలులో ఉన్న నిందితులు మూల తిరుమలరెడ్డి, లంక శేఖర్‌ను కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ కోర్టు ద్వారా 24 గంటల పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరి ఇళ్లలో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకుగాను బాధితుడు కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన కరీంనగర్ రూరల్ పోలీసులు, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అందులో ఇద్దరిని కరీంనగర్ తీగలగుట్టపల్లికి చెందిన మూల తిరుమలరెడ్డి, కరీంనగర్ విద్యారణ్యపురి కాలనీకి చెందిన లంక శేఖర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. ఈ కేసులో మరింత విచారణ చేసేందుకు సీఐ ఏ ప్రదీప్ కుమార్ నిందితులిద్దరి ఇళ్లలో సోదాలు జరిపి కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నారు.



నిందితుల ఇళ్లలో సోదాలకు తీసుకువెళుతున్న సీఐ ఏ ప్రదీప్‌కుమార్

వైభవోపేతంగా అవబృథ చక్రస్నానం



కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 26: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, అర్చకులు వంశీధరాచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామాచార్యుల మంత్రోచ్ఛరణాల నడుమ వైభవోపేతంగా అవబృథ చక్రస్నానం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అష్టోత్తరశత (108) కలశాభిషేకం కార్యక్రమం జరిపించారు. స్వామివారి ఉత్సమూర్తులను బాజాభజంత్రిలు, మేళా తాళాలు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ఆవరణలోని కోనేరు వద్దకు తీసుకెళ్లి అవబృద చక్రస్నానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, భక్తులు సురేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **కన్నుల పండువగా శ్రీపుష్పయాగం**

మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా శ్రీపుష్పయాగం (నాఖబలి) ఆలయ ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామచార్యులు మంత్రోచ్ఛరణాల నడుమ నిర్వహించారు. రాత్రి 9గంటలకు ద్వాదశా రాధన నిత్యవిధి అనంతరం శ్రీపుష్పయాగం (నాఖబలి) జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పండ్లు, పూలు, శ్రీసీతారామచంద్రస్వామి మూర్తులకు సమర్పించారు. నాఖబలి సందర్భంగా తీరొక్క పూలతో కల్యాణ వేదికను ఘనంగా అలంకరించి వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీపుష్పయాగం జరిపించారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.



కోనేరులో అవబృథ చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

కొడిమ్యాల, ఏప్రిల్ 26: మండలంలోని చెప్యాల గ్రామంలో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలోని రజక కులస్తులు, సుమారు 60 మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయం వరకు డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి పూజలు చేసారు. అనంతరం నైవేద్యాలను సమర్పించుకున్నారు. పిల్లా పాపలను చల్లంగా చూడాలని పోచమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. మడలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈదమ్మ, నందీశ్వరుల విగ్ర హాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమాల్లో రజక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సీడ్ ప్లాంట్‌లో పోలీసుల తనిఖీలు

శంకరపట్నం, ఏప్రిల్ 26: శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని కావేరి సీడ్ ప్లాంట్‌లో సీపీ ఆదేశాల మేరకు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో కేశవపట్నం పోలీసులు, కేంద్ర బలగాలు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కావేరి సీడ్ ప్లాంట్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వలస కార్మికుల ఆధార్‌కార్డులు, ఇతర అడ్రస్ ప్రూఫులను పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో వారు నివాసం ఉండే క్వార్టర్స్‌లో కార్మికులు అసాంఘిక కార్యకలాపాలకు పడుతున్నారా, ఏవైనా మత్తు పదార్థాలు వాడుతున్నారా అనే విషయంపై పూర్తి స్థాయిలో తనిఖీ నిర్వహించారు. అనంతరం సీఐ వెంకట్ సీడ్ ప్లాంట్ నిర్వాహకులతో మాట్లాడారు. వలస కార్మికుల పూర్తి ఆధారలతో కూడి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆముదాలపల్లి ఎక్స్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేత కరీంనగర్ మహిళా జట్టు



చాంపియన్‌గా నిలిచిన మహిళల కరీంనగర్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26: తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ హాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ తెలంగాణ హ్యాండ్ బాల్ ప్రీమియం లీగ్ పోటీల్లో కరీంనగర్ జిల్లా మహిళల జట్టు విజయం సాధించింది. ఈనెల 24, 25, 26 తేదీల్లో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా మహిళల జట్టు రాష్ట్రంలోని వివిధ జట్లపై విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుందని జిల్లా అండ్ వాల్ అసోసియేషన్ హాయ్ బాధ్యులు జిట్టవేణి శ్రీనివాస్ తెలిపారు .ఈ సందర్భంగా ప్రథమ స్థానం సాధించిన మహిళల జట్టును జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల శ్రీనివాస్ ,ఎం.డి యూనిస్ పాషా, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు నందలి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్ ,రాజ్ కుమార్, భాస్కర్ ,వడ్లూరి రాజేందర్, ఐతర వేణి శ్రీనివాస్ , అనుప్ రెడ్డి, వీరుపాల్ రెడ్డి తదితరులు అభినందించారు.

ఆరేళ్ల అనంతరం నిందితుడి అరెస్టు

- కేసు నుంచి తప్పించుకోవడానికి విదేశాలకు
- తిరిగివస్తుండగా ఏయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

మల్యాల, ఏప్రిల్ 26: ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులో నిందితుడిని ఆరేళ్ల అనంతరం శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో సాజిద్‌ఖాన్, సాయిగణేష్, సాగర్, బావు మహేష్ అనే యువకులపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు అయింది. కేసు నుంచి తప్పించుకోవడానికి మహేష్ విదేశాలకు వెళ్లాడు. మిగితా ముగ్గురు నిందితులను గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మహేష్ ఇండియా వస్తున్నా డనే సమాచారం మేరకు మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఏయిర్‌పోర్టులో అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు.

మే 3న డాక్ అదాలత్

భగత్‌నగర్, ఏప్రిల్ 26: భారతీయ తపాలశాఖ ఆధ్వర్యంలో మే 3వ తేదీన డాక్ అదాలత్ కార్యక్రమం ని ర్వహించనున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరిం టెండెంట్ కె శివాజి ఒకప్రకటనలో తెలిపారు. పోస్టల్ శాఖకు సంబంధించి ప్రజలకు సంబంధించిన సలహాలు సూచనలు, ఫిర్యాదులను రెండవ డాక్ ఆదాలత్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న వాటిని డాక్ అదాలత్‌లో స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు ఫిర్యాదులు, సలహాలు సూచ నలు అందించాలన్నారు. కరీంనగర్ డివిజన్ పరిధిలోని జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని సమ స్యలను పోస్టల్ ఎన్‌వలప్స్, కవర్స్‌ను కె శివాజి, సూ పరిండెండెంట్, పోస్ట్ ఆఫీస్ కరీంనగర్ డివిజన్, కరీం నగర్-505001 అడ్రస్‌కు 29వ తేదీలోగా చేరుకునే విధం గా పంపించాలన్నారు. మే 3న డాక్ అదాలత్ కరీంనగర్ సూపరింటెండెంట్ కార్యాలయం, కరీంనగర్ డివిజన్ మొదటి అంతస్తులో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈత నేర్చుకుంటూ బాలుడి మృతి

- తండ్రి కళ్లెదుటే ఘటన - బోయినపల్లి మండలం తడగొండలో విషాదం



మణితేజ (ఫైల్)

బోయినపల్లి, ఏప్రిల్ 26: వేసవి సెలవులు రావడంతో ఓ వ్యవసాయ బావిలో ఈత నేర్చుకోవడానికి వెళ్లిన బాలుడు తండ్రి కళ్లెదుటే నీటిలో మునిగి మృతి చెందాడు. బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటన స్థానికంగా విషాదం నింపింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. జిల్లాలోని బోయినపల్లి మండలం తడగొండకు చెందిన చేపూరి గంగయ్య - తిరుమల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మణితేజ (12) గంగాధర మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు రావడంతో మణితేజకు ఈత నేర్పించేందుకు తండ్రి గంగయ్య గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు ఐదు రోజులుగా తీసుకెళ్తున్నాడు. నాలుగు రోజులపాటు వాటర్ క్యాన్ సహాయంతో ఈత నేర్చుకున్నాడు. శుక్రవారం మణితేజకు వాటర్ క్యాన్ సహాయం లేకుండానే నీటిలో దిగాల్సిందిగా తండ్రి సూచించాడు. దీంతో మణితేజ వ్యవసాయ బావిలో సగం దూరం వెళ్లగానే నీటిలో మునిగిపోయాడు. వెంటనే బావిలో ఈత కొడుతున్నావారు, తండ్రి గంగయ్య గాలించారు. ఫలితం లేకపోవడంతో కొద్దిసేపటికి తెప్ప సహాయంతో గజ ఈతగాళ్ల గాలింపు చేపట్టగా మణితేజ శవమై కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీలు సాధారణం



సన్మానిస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 26: ప్రతి ఉద్యోగికి బదిలీలు సాధారణమేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. శుక్రవారం సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల నుంచి బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కడైన విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ మాట్లాడుతూ తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, మాజీ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ఏజీపీ రవీందర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పక్కాగా పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పక్కాగా నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశమందిరంలో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించారు. ఈ ప్రక్రియను కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా పర్యవేక్షించారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని వట్టెంలలో నిర్వహించనున్న రేణుకా ఎల్లమ్మ సిద్దోగం కార్యక్రమానికి హాజరుకావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను గ్రామ గౌడ సంఘం నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎంపీటీసీ రంగు వెంకటేశం, గౌడ సంఘం అధ్యక్షుడు మంద నారాయణ, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 26: మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ల్యాగల జలపతి మృతిచెందగా బాధిత కుటుంబానికి ఎంపీ సంజయ్‌కుమార్ ఆర్థిక సహాయం అందించారు. బీజేపీ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.25 వేల నగదును అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్, మహిళామోర్చా అధ్యక్షురాలు అశ్విని, నాయకులు శ్రీకాంత్, లక్ష్మన్, సంతోష్‌గౌడ్, అశోక్, కృష్ణ, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

ముస్తాబాద్, ఏప్రిల్ 26 : మండలంలోని పోత్గల్ ప్రభుత్వాసుపత్రి పరిధిలో ఆవునూర్, గూడెం, నామాపూర్, చీకోడ్, మద్దికుంట, బందనకల్ గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. మండల వైద్యాధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి నేతృత్వంలో బందనకల్, మద్దికుంట, చీకోడ్, ఆవునూర్, నామాపూర్, గూడెం, గ్రామాల్లో దంత వైద్య శిబిరాలను, గూడెం, ఆవునూర్‌లో ఈఎన్‌టీ, ఆర్థో శిబిరాలకు నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌వో సుమన్‌మోహన్ రావు, డాక్టర్ రజిత, దంత వైద్యుడు డాక్టర్ శహనాజ్, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ సుష్మ, ఎముకల వైద్యుల నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశానికి గుర్తింపు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 26: ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే దేశానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని, బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శక్తికేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా బండి సంజయ్‌కుమార్ గెలిచే వరకు ప్రతీ కార్యకర్త ప్రజల్లో ఉండాలన్నారు. నాయకులు శ్రావణ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనీల్‌కుమార్, దేశెట్టి శ్రీనివాస్, మహేష్, రవీందర్‌రెడ్డి, అశోక్, కృష్ణ, లక్ష్మారెడ్డి, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

పాత బస్టాండ్‌లో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 26: సిరిసిల్ల పాతబస్టాండ్‌లో బాంబ్ , డాగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు విస్తృత తనిఖీలు చేపట్టారు. దాదాపు అరగంటసేపు పరిశీలించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 : తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం సిరిసిల్ల పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్ల లచ్చయ్యగౌడ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెల్లె కనుకయ్య, ఉపాధ్యక్షుడిగా జింక శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఆకారపు సుధాకర్, కోశాధికారిగా కొడిముంజ ఎల్లయ్య, ముఖ్య సలహాదారులుగా శనిగరపు రాజు, బందల మధు ఎన్నికయ్యారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసిక మారుతి, ఉపాధ్యక్షుడు దమ్మని మొండయ్య, కోశాధికారి దుంపేట కరుణాకర్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఈర్ల రాజలింగం, గౌరవ అధ్యక్షుడు కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ కార్యకర్త ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, పార్టీ అభ్యర్థి గెలుపునకు పాటు పడాలని అన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, శ్రీను, లింగాగౌడ్, బాల్‌రెడ్డి, దేవానందం, రాంరెడ్డి పాల్గొన్నారు.

లారీ నుంచి కింద పడిన ధాన్యం బస్తాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: వీర్నపల్లి మండలం వన్‌పల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి లారీలో రైస్ మిల్లుకు తరలిస్తున్న ధాన్యం బస్తాలు శుక్రవారం ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో కింద పడిపోయాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. వీర్నపల్లి మండలం వన్‌పల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలను లారీలో రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. లోడ్ చేసిన క్రమంలో బస్తాలకు తాడును సరిగా కట్టకపోవడంతో ఒక్కసారిగా కింద పడ్డాయి. సుమారు గంటపాటు రోడ్డుపైనే ధాన్యం బస్తాలు ఉండిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లారీ డ్రైవర్‌కు విషయం చెప్పడంతో వాహనాన్ని నిలిపి కింద పడిన ధాన్యం బస్తాలను హమాలీలతో లోడ్ చేయించాడు. హమాలీలు తాడును సరిగా బిగించకపోవడంతో బస్తాలు కింద పడ్డాయని లారీ డ్రైవర్ పేర్కొన్నాడు.

'పరపతి'కి నిరీక్షణ



- జిల్లాలో 2019లో కొత్తగా 5 సింగిల్ విండోలకు ప్రతిపాదనలు
- ఇప్పటికీ పెండింగ్‌లోనే
- జిల్లాలో 24 సహకార సంఘాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు విస్తరణ ఎదురు చూపులకే పరిమితమైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను విభజించడంతో కొత్తగా మూడు జిల్లాలు ఏర్పడ్డాయి. కొత్త జిల్లాల్లో ఇప్పటి వరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు దాదాపు నాలుగు సంవత్సరాల క్రితమే కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. ఇప్పటికీ అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. 2019లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఐదు వ్యవసాయ ప్రాథమిక కేంద్రాలను ఏర్పాటు చేయడానికి పంపిన ప్రతిపాదనలకు ఈ ప్రభుత్వంలోనైనా మోక్షం లభిస్తుందని ఆశించినా వరుస ఎన్నికలతో పరపతి సంఘాలు పెరిగే అవకాశాలు దూరంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. గతేడాది మేలో కేంద్ర మంత్రి మండలి దేశంలో వచ్చే ఐదేళ్లలో 2 లక్షల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. గ్రామానికో సంఘాన్ని ఏర్పాటు చేసి రైతులకు 25 రకాల సేవలు అందించాలని నిర్ణయించారు.

● సొసైటీల్లో 74,728 మంది సభ్యులు

జిల్లాలో ప్రస్తుతం 24 సంఘాలు ఉన్నాయి. సంఘాల పరిధిలో 74,728 మంది సభ్యులు ఉన్నారు. సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 12,859 మంది సభ్యులు ఉండగా పెద్దూరు సొసైటీలో 1336, నేరెళ్ల 1257, కోనరావుపేట 6196, కొలనూరు 3018, వేములవాడ 8180, నాంపెల్లి 1191, రుద్రవరం 998, చందుర్తి 3369, సనుగుల 1733, బోయినిపల్లి 910, కోరెం 1694, మాన్వాడ 1163, నర్సింగాపూర్ 1684, ఇల్లంతకుంట 3547, గాలిపెల్లి 1680, ముస్తాబాద్ 2082, పోత్గల్ 7169, గంభీరావుపేట 8183, కొత్తపెల్లి 3680, ఎల్లారెడ్డిపేట 3864, అల్మాస్‌పూర్ 2139, తిమ్మాపూర్ 1597, మానాలలో 199 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీలను విస్తరించి వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలని రైతులు కోరుతున్నారు.

● జిల్లాలో పరపతి సంఘాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత సంవత్సరం మేలో కేంద్రమంత్రి మండలి నిర్ణయం మేరకైనా పరపతి సంఘాలు పెరుగుతాయని అన్నదాతలు భావించారు. ఇప్పటికీ ప్రతిపాదన దశలోనే ఆగిపోయాయి. జిల్లాలో ప్రస్తుతం 24 సహకార సంఘాలు ఉండగా 74,728 మంది సభ్యులు ఉన్నారు. వారిలో 35,776 మందికి ఓటు హక్కు ఉంది. గత ప్రభుత్వం మండలానికి రెండు సంఘాలు ఉండే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాలో 13 మండలాలు ఉండగా 24 సహకార సంఘాలు ఉన్నాయి. కొత్తగా తంగళ్లపల్లి, మర్రిపల్లి, వట్టెంల, వీర్నపల్లి, గర్జనపల్లి, రుద్రంగి సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. కొత్త సంఘాలు ఏర్పడిన తర్వాత సింగిల్‌విండో ఎన్నికలు నిర్వహిస్తారని భావించినా కొత్త సంఘాలు ఏర్పడకముందే ఎన్నికల నిర్వహణ పూర్తి చేశారు. కొత్త సంఘాల ప్రతిపాదనలు మూలనపడ్డాయి. కేంద్రప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటుకు నిర్ణయించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర సహకార బ్యాంక్ సేవలను అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేసే ఆలోచన చేసింది. సింగిల్ విండోలు రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీకి తోడ్పడుతున్నాయి. వీటిని బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం, గత రాష్ట్ర ప్రభుత్వం భావించినా ఫలితాలు నామమాత్రంగానే మారాయి.

నేతన్నల ఆత్మహత్యలపై బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 : సిరిసిల్ల పట్టణంలో నేతన్నలు ఆత్మహత్య చేసుకుంటే వారి శవాలతో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకులు మండిపడ్డారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప మాట్లాడారు. నేతన్న ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర జౌళిశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆమాట అనడానికి సిగ్గుపడాలన్నారు. బతుకమ్మ చీరలను తీసుకొచ్చి కార్మికులకు నాలుగు నెలలు పని కల్పిస్తే ఎనిమిది నెలలు ఖాళీగా ఉన్నారన్నారు. బతుకమ్మ చీరలు నేయాలని చెప్పి కాటన్, పాలిస్టర్ సిరిసిల్లలో బంద్ చేయించారన్నారు. ఇతర రాష్ట్రాలలో ఏ ప్రభుత్వం వచ్చిన అక్కడ నేసే బట్టలను రద్దు చేయకుండా జీవోలు తీసుకొచ్చాయని, ఇక్కడ ఎందుకు తీసుకురాలేదని అన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారని, సిరిసిల్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 300 బకాయిలను పెట్టిందని అన్నారు. గత ప్రభుత్వంలో కట్టిన వంతెన గాలివీస్తే కొట్టుకుపోయిందన్నారు. నేతన్నల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడలేదన్నారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో చిక్కిన కవిత గురించి మాట్లాడని కేటీఆర్ నేతన్నల శవాలతో రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని పోగు, కండెలు, వార్పిన్ అంటే ఏంటో తెలుసుకొని రాణిరుద్రమ మాట్లాడాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ వేసిందన్నారు. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉందని, ఇక్కడ మాట్లాడే బీజేపీ నాయకులు అక్కడా మాట్లాడాలని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ గురించి ఎంపీ బండి సంజయ్ ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. రాణిరుద్రమ ఇతర రాష్ట్రాలలో వస్త్ర పరిశ్రమ ఎలా నడుస్తుందో తెలుసుకోవాలన్నారు. చనిపోయిన వారిపై రాజకీయాలు చేయకుండా నివారణ చర్యలపై మాట్లాడాలన్నారు. సిరిసిల్లలో కార్మికుల ఆదాయం పెరగాలని, అభివృద్ధి జరగాలని తాము కోరుకుంటున్నామన్నారు. కార్మికులకు 365 రోజులు పని కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణను రూపొందిస్తోందని, అధైర్య పడవద్దని అన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్ముల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్, వెంకటేశం పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 26 :చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆదుకుంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జల్లం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేనేత రంగాన్ని బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయన్నారు. చేనేత రంగానికి రూ.300 కోట్ల బకాయిలు విడుదల చేయక బీఆర్ఎస్ ప్రభుత్వం, మెగా టెక్స్‌టైల్‌ను ఇక్కడి నుంచి వేరే చోటికి తరలించి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేనేత కార్మికులను మోసం చేశాయన్నారు. కార్మికుల శ్రమ దోపిడీ చేసి బతుకమ్మ చీరల పేరు మీద వందల కోట్లు కేటీఆర్ దోచుకున్నారని ఆరోపించారు. రాజకీయ పబ్బం గడుపుకోడానికే బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. చేనేత రంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నేత కార్మికుల ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. ఏడాది పొడవునా నేత కార్మికులకు పని కల్పించడానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డి కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు. సిరిశాల ఉరిశాలగా మారుతుందని మాట్లాడిన కేటీఆర్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేనేత కార్మికులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయలేదని, కార్మికులు మనోవేదనకు గురవడానికి కారణం మీరు కాదా? అని ప్రశ్నించారు. త్రిఫ్ట్, చేనేతకు చేయూత, బతుకమ్మ చీరలు ఇచ్చామని ప్రగల్భాలు పలికిన కేటీఆర్, ఆ పథకాలు తెచ్చింది ఆసాముల కోసమా కార్మికుల కోసమో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే మొదటగా రూ.50 కోట్ల బకాయిలను విడుదల చేసిందని, మిగతా డబ్బులు కూడా త్వరలోనే విడుదల చేస్తుందని అన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి అనవసర ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్లం ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ నాయకుల వైద్య శివప్రసాద్, పూర్మాణి లింగారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, కావటి మల్లేశం, చుక్క శేఖర్, చిన్నమనేని ప్రశాంత్ పోకల సాయికుమార్, శంకర్, కొత్త రవి, ఇక్బాల్, భరత్, బాలు, శ్రీనివాస్, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లో సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠాపన చేపట్టారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్లు సుధీర్‌రావు, కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, కాంగ్రెస్ నేత గాంధీరావు- రమాదేవి దంపతులు, మాజీ సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ రామగిరి పెద్దకిషన్‌రావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో పార్లమెంటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కర పత్రాలను అందిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి ఓటు వేయాలని కోరారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడిన బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, నాయకులు సుధాకర్‌రావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆత్మహత్యలు ఉపాధి లేక కాదు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 26: సిరిసిల్ల, తంగళ్లపల్లిలో ఇద్దరు కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం ఉపాధి లేక కాదని, ఒకరు ఆర్థిక ఇబ్బందులు, మరొకరు అనారోగ్య సమస్యతోనని విచారణలో తేలిందని చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అంకారపు మల్లేశంగతంలో కారంపురి సురేష్ ఆసామి వద్ద మరమగ్గాల కార్మికుడిగా 2023 అక్టోబరు 31వరకు పనిచేశాడని పేర్కొన్నారు. ఆ సమయంలో కుమార్తె వివాహంతో పాటు డెలివరీ ఖర్చులకు తోడు మూడు నెలల క్రితం భార్యకు కాలు విరగడంతో అదనపు ఖర్చులతోపాటు రూ.3లక్షల అప్పులు ఉన్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. తక్కువ ఆదాయంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మనస్తాపానికి గురై చెట్టుకు ఉరేసుకున్నాడని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన అడిచెర్ల సాయికుమార్ గతంలో గోవిందు కనకయ్య, గాజుల నారాయణ వద్ద వార్పిన్ పని చేస్తూ ఉండేవాడని, రెండేళ్ల నుంచి పని చేయడం లేదని, పక్షవాత లక్షణాలతోపాటు కిడ్నీ సమస్యతో వైద్యం కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగు తూ ఉండేవాడని తెలిసినట్లు పేర్కొన్నారు. కార్మికుల కోసం ప్రవేశ పెట్టిన నేతన్నకు చేయూత, నేతన్న బీమా పథకంలో ఇద్దరు కార్మికులు నమోదు చేసుకోలేదని తెలిపారు.

రూ.50 వేలకు మించి తీసుకెళ్లరాదు

- ఎస్పీ అఖిల్ మహాజన్



తిప్పాపూర్ తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు రూ.50 వేలకు మించి తీసుకెళ్లరాదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. తిప్పాపూర్ బస్టాండ్ వద్ద పోలీసులు నిర్వహించిన నాకబందీలో భాగంగా వాహనాల తనిఖీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో మద్యం, నగదు, మాదకద్రవ్యాలు, ప్రలోభ పరిచే వస్తువులు సరఫరా కాకుండా జిల్లా సరిహద్దుల్లో, పట్టణాల్లో మండల కేంద్రాల్లో డైనమిక్ తనిఖీలు, నాకాబందీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి సరైన ధృవపత్రాలు సమర్పిస్తే గ్రీవెన్స్ కమిటీ ద్వారా రెండు రోజుల్లో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. డీఎస్పీ నాగేంద్రచారి, ఆర్డీవో రాజేశ్వర్, ఎంఆర్‌వో మహేష్, పట్టణ సీఐ వీర ప్రసాద్, ఎస్సై అంజయ్య, గోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై దిలీప్ ఉన్నారు.

వాహనాలకు సైరన్ అమరిస్తే చర్యలు

సిరిసిల్ల క్రైం: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు సైరన్‌లు అమరిస్తే చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం జిల్లాలో సైరన్‌లు అమర్చిన వాహనాలను సీజ్‌చేసిన వివరాలు వెల్లడించారు. నెల రోజుల్లో జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు సైరన్‌లు బిగించిన ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. త్రిబుల్ రైడింగ్ చేసిన 159 మందికి జరిమానా విధించామని, కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. 23 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశామని, సైలెన్సర్‌లు బిగించిన 27 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

- 20 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

కరీంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్‌పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం పూర్తయ్యింది. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అభ్యర్థులు, వారి తరఫున హాజరైన ప్రజాప్రతినిధుల సమక్షంలో కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా పర్యవేక్షణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్ పత్రాలను పరిశీలించారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి 53 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 94 నామినేషన్లను పరిశీలించారు. లోపాలున్న, సరిగా వివరాలు సమర్పించని 20 మంది నామినేషన్లను తిరస్కరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. 33 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్లు తెలిపారు. తిరస్కరణకు గురైన అభ్యర్థుల సెక్యూరిటీ డిపాజిట్‌ను తిరిగి ఇస్తామని, నామినేషన్ ఎందుకు తిరస్కరణకు గురైందో వివరాలు అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు.

● 29వ తేదీ 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు

కరీంనగర్ పార్లమెంట్‌స్థానానికి నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ 3 గంటల వరకు అవకాశం ఉందని ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాలు సెలవులు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల్లోగా నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకోవచ్చన్నారు. 29వ తేదీ 3 గంటలవరకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ట్రైని కలెక్టర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధి లేకనే నేతన్నల ఆత్మహత్యలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 26: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించి నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించకపోవడంతోనే కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన అడిచెర్ల సాయి కుమార్ అనే వార్పిన్ కార్మికుడు ఉపాధి లేక గురువారం ఆత్మహత్య చేసుకోవడంతో శుక్రవారం జిల్లా ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు దుమాల శ్రీకాంత్, రాజుసింగ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం భరోసా కల్పించకనే..

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా కల్పించక పోవడంతోనే నేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ఏఐఎఫ్‌టీయూ (న్యూ) జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో సిరిసిల్ల పట్టణం, తంగళ్లపల్లిలో ఇద్దరు నేత కార్మికులు ఒకేరోజు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా కల్పించక పోవడంతో నలుగురు కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. నాయకులు కూరపాటి సతీష్, గుజ్జె దేవదాస్, రవి, సత్తయ్య, మార్కండేయ, బాలయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

కార్మికుల ఆత్మహత్యలపై ప్రభుత్వం బాధ్యత వహించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 : సిరిసిల్ల నేత కార్మికుల ఆత్మహత్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు అరుకాల రమేష్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరమగ్గాల కార్మికుల యారన్ సబ్సిడీతో పాటు రూ.250 కోట్లు బకాయిలను ప్రభుత్వం విడదల చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ నియోజకవర్గం అని చిన్నచూపు చూడకుండా బకాయిలను విడదల చేయాలన్నారు. బీఎస్పీ పట్టణ ఉపాధ్యక్షుడు గుంటుక రమేష్, ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీనివాస్, కోశాధికారి గడ్డం కమలాకర్, సలహాదారు వెంగళ అంజనేయులు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 : దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి అధ్యక్షతన సిరిసిల్ల నియోజకవర్గం స్థాయి ముఖ్య నాయకుల సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలపించాలన్నారు. ఎంపీగా బండి సంజయ్ సిరిసిల్ల నేతకార్మికుల జీవనోపాధి కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏం చేశారో బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజు, కొంక విజయ్, సదానంద్ పాల్గొన్నారు.

సెస్‌లో ఘర్షణ.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 26: సిరిసిల్ల సెస్‌లో ఓ డైరెక్టర్, మరో కాంట్రాక్టర్ మధ్య ఘర్షణ తలెత్తింది. శుక్రవారం సెస్ కార్యాలయంలో విద్యుత్ పనులకు సంబంధించి డబ్బులు రావాలని కాంట్రాక్టర్ మధు చైర్మన్ చాంబర్‌కు వెళ్లి చైర్మన్ చిక్కాల రామారావును అడిగాడు. అదే సమయంలో అక్కడే ఉన్న సెస్ డైరెక్టర్ సుధాకర్ ఫోన్ విషయమై జోక్యం చేసుకొని ఘర్షణకు దిగారు. చైర్మన్ సముదాయించి కాంట్రాక్టర్‌ను అక్కడి నుంచి పంపించారు.సెస్ కార్యాలయంలోని కమర్షియల్ విభాగంలోకి వెళ్లిన కాంట్రాక్టర్ వద్దకు డైరెక్టర్ చేరుకోవడంతో మళ్లీ ఘర్షణ చోటుచేసుకుంది. ఇంతటితో ఆగకుండా ఒకరిపై మరొకరు దాడికి దిగడంతో అక్కడే ఉన్న ఉద్యోగులు జోక్యం చేసుకొని ఇద్దరిని పక్కకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఘటనపై విచారణ చేపట్టామని టౌన్ సీఐ తెలిపారు.

వడదెబ్బతో కూలీ మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన శంకర్ సదా (33) అనే కూలీ శుక్రవారం వడ దెబ్బతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలం అచ్చన్నపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో బీహార్ రాష్ట్రానికి చెందిన శంకర్ సదా కూలీగా పని చేస్తున్నాడు. శుక్రవారం కేంద్రంలో పని చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. నిర్వాహకులు, రైతులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుల బహిష్కరణలపై పోలీసుల దృష్టి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: పల్లెల్లో కొనసాగుతున్న కుల బహిష్కరణలపై స్థానిక పోలీసులు దృష్టి సారించారు. కులం నుంచి బహిష్కరిస్తే కఠిన చర్యలు తప్పవని శుక్రవారం ఎస్సై రమాకాంత్ హెచ్చరించారు. ఇటీవల దుమాలలో కుల సంఘం పెద్దలు తమను బహిష్కరించాలని పేర్కొంటూ ఓ కుటుంబం స్థానిక పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. తమను కులం నుంచి వెలి వేసి మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ రమాకాంత్ కుల సంఘం పెద్దలను పిలిచి అవగాహన కల్పించారు. మార్పు రాకపోవడంతో కేసు నమోదు చేశామని తెలిపారు.